ఘనంగా పునర్‌నిర్మాణ శిఖర మహోత్సవం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో న్యామతబాద్‌లో హనుమాన్ మందిరంలో రెండో రోజు భక్తిశ్రద్ధలతో గ్రామస్తుల ఆధ్వర్యంలో న్యామత బాద్ విశ్వ నందగిరి మహారాజ్ , సిద్దలింగేశ్వర మహారాజ్ పర్యవేక్షణలో హనుమాన్ మందిర పునర్నిర్మాణ శిఖర మహోత్సవాలు జరుగుతున్నాయి. యజ్ఞోమాలు, పూజారులు వేదమంత్రాలతో కుటుంబ సమేతంగా యజ్ఞో పూజలు ఉదయం నుంచి పూజలు ప్రారంభమయ్యాయి వివిధ పరిసర గ్రామాల భక్తులు మహిళలు మహోత్సవాల్లో పాల్గొని దర్శించుకున్నారు. మంగళవారం అహహిత దేవత పూజలు ప్రతిష్ఠాపన ఆహ్వానం మహా మంగళహారతి తీర్థప్రసాదల వితరణ గ్రామస్తులు పాల్గొని పూజలు సుఖ సంతోషాలు ఉండాలని పాడి పంటలు బాగా పండాలని కొనసాగాయి నిత్య అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు గ్రామస్తులు చెప్పారు నేడు చివరి రోజు హనుమాన్ మందిర శిఖర పునర్మాణ ధ్వజస్తంభ మహోత్సవంలో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి పూజలో పాల్గొనాలని సిద్ధి లింగేశ్వర మహారాజ్ , గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ(ఎం) మద్దతు

- సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి. జయరాజ్



నవతెలంగాణ-పటాన్‌చెరు: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఐఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి జయరాజ్ తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల అధ్వర్యంలో 16 న సమ్మె జరుగుతుందన్నారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం 2వ సారి అధికారం లోకి వచ్చాక సంస్కరణలను వేగవంతం చేసిందన్నారు. కార్మిక చట్టాలను పూర్తిగా తుంగలో తొక్కిందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించలేని స్థితిలో వుందన్నారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టంను నీరు కార్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడి దారుల కు దాసోహం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యులు వాజిద్ అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దృష్టి సన్నగిల్లుతోంది..!

- చిన్నారుల ఆరోగ్యం పదిలమేనా..?
- సంవత్సరాలు గడుస్తున్న కేటాయించని అప్తల్మాలజీస్టు
- నిరుపయోగంగా డాక్టర్ భవనం



నవతెలంగాణ-ఝరాసంగం

పిల్లలలో తీవ్రమైన వ్యాధులు, ఇన్ఫెక్షన్లను నివారించగల అంధత్వానికి విటమిన్ ఎ లోపం ప్రధాన కారణం అని చెప్పొవచ్చు. గర్భిణీ స్త్రీలలో రాత్రి అంధత్వానికి ఇది ప్రధాన కారణాలలో మరొక్కటి. ఇది రోగనిరోధక వ్యవస్థను కూడా ప్రభావితం చేస్తుంది. అంతే కాకుండా మలేరియా డయేరియా మీజిల్స్ లాంటి వ్యాధులతో మరణాలకు దారితీస్తుంది. విటమిన్ ఎ లోపం వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడటానికి శరీరం యొక్క అసమర్థతను పెంచుతుంది. దీని వల్ల అనేక రకరకాల వ్యాధులు వస్తున్నాయి. విటమిన్ ఎ లోపం పిల్లల్లో ఎముకల పెరుగుదలను, వారి మొత్తం శరీర పెరుగుదలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

రేచీకటి లేదా నిక్టలోపియా అనేది మసక వెలుతురులో లేదా రాత్రి సమయంలో చూడలేని అసాధారణమైన అసమర్థతకు దారి తీస్తుంది. నిక్టలో పియాకు మరొక అత్యంత సాధారణ కారణం రెటినిటిస్ పిగ్మెంటోసా అంటే రెటనాలోని రాడ్ కణాలు కాంతికి ప్రతిస్పందించే సామర్థ్యాన్ని క్రమంగా కోల్పోతాయి. దీనివల్ల పిల్లలకు రేచీకటి కల్గుతుంది. పొడిబారిన చర్మం, డ్రై ఐస్, కన్నీళ్లను ఉత్పత్తి చేయకపోవడం, రాత్రి పూట అలసత్వం, సంతానలేమి, ఆలస్యమైన వృద్ధి, గొంతు, ఛాతీలో ఇన్ఫెక్షన్స్ లాంటి వ్యాధులు రావడానికి దారి తీస్తుంది.

సెల్ ఫోన్‌తో దృష్టి లోపం.. అవగాన కరువు

ఎక్కువ సమయం స్క్రీన్ చూడడం వల్ల కళ్లలో మంట రావడం, కళ్లు పొడిబారడం, కళ్లలో నొప్పి, తలనొప్పి, మెడనొప్పి, కళ్ల నుంచి నీరు కారడం వంటి సమస్యలు వస్తాయి. తలనొప్పికి కారణం చూస్తే.. కళ్లతో స్క్రీన్‌ను ఎక్కువ టైం చూడడం వల్ల సిలియరీ అనే కండరాలపై ఒత్తిడి పెరుగుతుంది. తద్వారా దగ్గరి చూపుపై ప్రభావం కూడా పడుతుంది. కళ్లు పొడి బారడానికి కారణం కూడా స్క్రీన్ ఎక్కువ టైం చూడడం. దీని వల్ల కంటి పైభాగంలో తేమ తగ్గుతుంది. స్పష్టమైన దృష్టి కలిగి ఉండడానికి తేమ అవసరం. పొడి బారడం వల్ల మంటలు, కళ్లు ఎర్రగా మారడం, కళ్ల దురద వంటివి వస్తాయి. డిజిటల్ పరికరాలను ఎక్కువ సమయం వినియోగించడం వల్ల దూరదృష్టి లోపం కూడా వస్తుంది. చాలా మంది పిల్లలు దూరదృష్టి కోసం కళ్ల జోడు వాడడానికి ఇదే ప్రధాన కారణం అని చెప్పవచ్చు. నిజానికి ప్రతి పిల్లాడికీ 8 నుంచి 10 ఏళ్ల వయసు అనేది అత్యంత కీలకం. ఈ సమయంలో పిల్లలకు దూరచూపు పెరుగుతుంది. కానీ, ఇదే సమయంలో చాలా మంది పిల్లలు టీవీలకు, సెల్‌ఫోన్లకు అంకితమవుతున్నారు. అవుట్‌డోర్ ఆటలకు దూరమవుతున్నారు. దీని వల్ల దూరపు చూపు ఉండడం లేదు. ఫలితంగా చాలా మంది పిల్లలు దూరపు చూపు కోసం చిన్న తనంలోనే కళ్లద్దాలు వాడాల్సి పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రత్యేక అప్తల్మాలజీస్టును నియమించాలి

మండల ప్రజల సౌకర్యార్థం గత ఏడాది జనవరి లో ఎల్ అండ్ టి, ఐడిపియల్ గ్రూప్ వారు సి ఎస్ ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల కింద మెటర్నిటీ వార్డ్, నియోనాటల్ కేర్ యూనిట్ అండ్ అప్తల్మాలజీ క్లినిక్ భవనాలను అప్పటి అడిషనల్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి, సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. లక్షల రూపాయలతో భవనాలు నిర్మించిన అవి ప్రజలకు ఉపయోగపడకుండా నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రైవేట్ సంస్థలు కొంత మేరకు ఆశిస్తున్న అధికారుల అలసత్వంతో వాటిని ఉపయోగంలోకి తేవడం లేదు. సకల సౌకర్యాలతో భవనాలు నిర్మించినప్పటికీ సరైన సిబ్బందిని నియమించకపోవడం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి మండలానికి ప్రత్యేక అప్తల్మాలజీస్టును కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లస్టర్‌కు ఒకే పారామెడికల్ అధికారి



జిల్లాలో ప్రస్తుతం మూడు క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్ కు ఒక పారామెడికల్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పీహెచ్సీలను కవర్ చేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రేచీకటి నిర్మూలనే లక్ష్యంగా ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాల్లో, అంగన్వాడి కేంద్రాల్లో ఉచితంగా మందులు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నం.

-జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి

వైద్య వృత్తి అత్యంత ఉన్నతమైనది

- మంచి డాక్టర్లుగా ఎదిగి ప్రజలకు సేవలు చేయాలి
- మెడికల్ కళాశాల పనుల పరిశీలించిన
- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి



నవతెలంగాణ-సంగారెడ్డి

వైద్య వృత్తి అత్యంత ఉన్నతమైనదని, విద్యార్థులు సబ్జెక్ట్ పై పూర్తి అవగాహన కలిగేలా బాగా కష్టపడి చదివి, నైపుణ్యం గల డాక్టర్లుగా ఎదిగి ప్రజలకు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వైద్య విద్యార్థులకు ఉద్బోధించారు. మంగళ వారం కలెక్టర్ సంగారెడ్డి మెడికల్ కళాశాల పనుల పురోగతిని, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. మెడికల్ కళాశాల రెండో బ్లాక్ లో నిర్మాణంలో ఉన్న కొత్త హాస్టల్ భవనాలు, పరిపాలన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఆయా భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి స్వాధీనం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. అదేవిధంగా మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కాంపౌండ్ వాల్ పూర్తి చేయాలని చెప్పారు.మెడికల్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ వృత్తి గౌరవ ప్రదమైనదని, విద్యార్థులకు సబ్జెక్టుపై పూర్తి నాలెడ్జ్ ఉన్నప్పుడే, రాబోయే రోజుల్లో డాక్టరుగా రోగుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించ గలుగుతారని, అందుకు బాగా చదివి,మంచి డాక్టర్లుగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి ఆస్పత్రి మొత్తం కలియ తిరిగి పరిశీలించారు. అన్నివార్డులను, ఆపరేషన్ థియేటర్లను, ఓపి, డయాలసిస్ సెంటర్, ఎంసిహెచ్, స్కానింగ్,రే ఓడియాలజీవిభాగం, ల్యాబ్స్‌ను తిరిగి చూసారు. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్‌తో నవజాత పిల్లల తల్లులతో గర్భిణులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్లో నమోదైన పేషెంట్ వివరాలు పరిశీలించారు. నవజాత శిశువుల తల్లులతో కలెక్టర్ మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే పాలు పట్టారా అంటూ అడిగారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు పట్టాలని,తల్లి పాలతో పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం ఆసుపత్రికి ఇంకా ఏమైనా ఎక్విప్మెంట్ అవసరం ఉన్నట్లయితే ఆయా వివరాలతో ప్రతిపాదనలను అందించినట్లయితే మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని కలెక్టర్ ఆసుపత్రి సూపర్డెంట్ కు సూచించారు.కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్ కుమార్,ఆర్ అండ్ బి అధికారులు, తహశీల్దార్,తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలు పూర్తిగా రూపుమాపాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ అనురాధ



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలో గుడుంబా గంజాయి, డ్రగ్స్ ఇతరత్రా మత్తు పదార్థాలు వాడకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీటి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా రూపుమాపాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్‌లో సీపీ అనూరాధతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ పరివర్తన కార్యక్రమం జిల్లాలో అమలు ప్రక్రియ గూర్చి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని నిరోధానికి మరింత పకడ్బందీ చర్యలు చేపట్టాలి అన్నారు. ముఖ్యంగా విద్యార్థులను డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రతి ఒక్కరు విధిగా మాదకద్రవ్యాల మహమ్మారిపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు కలిసి యాంటీ డ్రగ్ కమిటీలుగా ఏర్పడాలని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవించినట్లు, సరఫరా చేసినట్లు తెలిస్తే వెంటనే ఈ కమిటీలు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీపీ అనురాధ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా చాలా తక్కువ గానే ఉందన్నారు. ఎక్కువగా బీహార్, ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన వలస కూలీలు మాత్రమే తక్కువ మోతాదులో తీసుకొస్తున్నారని సమాచారం ఉందన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ గంజాయి లేయర్లతో కూడిన చాక్లెట్లు అమ్మకం ద్వారా వాటిని విద్యార్థులు తీని ఆ చాక్లెట్లకు బానిస అవుతున్నారన్నారు. జిల్లాలో పాన్ షాప్, బార్స్ కొన్ని ప్రదేశాలపై ముందస్తు చర్యల ద్వారా మారకద్రవ్యాల సరఫరా పై ప్రత్యేక నిఘా పెంచామన్నారు. గంజాయి రవాణా హుస్నాబాద్, అక్కన్నపేట్, కోహెడ మండలాల్లో అక్కడక్కడ కనిపిస్తుందన్నారు. డ్రగ్ ఈజ్ బగ్ గుడ్ బాయ్ డ్రగ్స్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెంట్ శ్రీనివాసమూర్తి, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ వినయ్ సుస్మిత, డీఎఫ్ఓ శ్రీనివాస్, డిడబ్ల్యుఓ రామ్ గోపాల్ రెడ్డి, డిఇఓ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట్ గజ్వేల్ ఆర్డీవోలు రమేష్ బాబు, బన్సీలాల్, డిఎంహెచ్ఓ కాశీనాథ్ పాల్గొన్నారు.

గీతంలో విజయవంతంగా ముగిసిన ఎఫ్‌డీపీ

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) '5జీ టెక్నాలజీ, ఆ పైన పురోగతి' అనే అంశంపై రెండు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్‌పీ) ఇటీవల నిర్వహించినట్టు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అధునాతన కమ్యూనికేషన్ టెక్నాలజీలో 5జీ టెక్నాలజీ, పరిశోధనా రంగాలలో తాజా పరిణామాలను సదస్యులకు పరిచయం చేయడం లక్ష్యంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఐఈఐ తెలంగాణ విభాగం పూర్వ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 5జీ టెక్నాలజీలో అభివృద్ధిని అందిపుచ్చుకోవాల్సిన ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు.ఈ రెండు రోజుల కార్యక్రమంలో పరిశ్రమ నిపుణులు 5జీ టెక్నాలజీకి సంబంధించిన వివిధ అంశాలపై లోతైన అవగాహన కల్పించారు. 5జీ కమ్యూనికేషన్స్ ప్రాథమిక అంశాలపై తేజోసెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమణ రావూరితీ 5జీ అభివృద్ధి విధానాలు, భవిష్యత్తు నెట్వర్క్ ల పై సిగ్ వర్క్ రీసెర్చ్ ల్యాబ్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్రప్రకాష్: బ్రాడ్ బ్యాండ్ కమ్యూనికేషన్లలో లేజర్ మూలాల పాత్రపై రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మార్తా ఎస్.రెడ్డి తదితరులు ప్రసంగించారు. 5జీ నెట్వర్క్ లో భద్రత, గోప్యత సవాళ్ల గురించి ట్రిబుల్ ఐటీ హైదరాబాద్ కు చెందిన డాక్టర్ ప్రఫుల్ మాన్కర్ వివరించారు.ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి స్వాగతోపన్యాసం చేయగా, కార్యక్రమ సమన్వయకర్త ఎం.రఘుపతి వందన సమర్పణ చేశారు.



ఎఫ్‌సీ ప్రారంభోత్సవంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేటెడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.సీతారామయ్య, పరిశ్రమ నిపుణులు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై ఉక్కు పాదం మోపాలి

- ప్రభుత్వ భూములు, జల వనరులను పరిరక్షించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
- మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు పూర్తి చేయాలి
- ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య సేవలు అందించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో అక్రమ మైనింగ్ పై ఉక్కు పాదం మోపాలని, నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మంత్రి జిల్లా కలెక్టర్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అక్రమ మైనింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మైనింగ్ రెవెన్యూ పోలీస్ శాఖలు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మైనింగ్ ను అరికట్టాలని ఆదేశించారు. ఇప్పటివరకు సేకరించిన వివరాలు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవిన్యూ శాఖదన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా క్షేత్రస్థాయిలో పరిరక్షించాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు కాపాడాలన్నారు. జల వనరులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. అక్రమ మైనింగ్, ప్రభుత్వ భూములు,వాటర్ బాడీస్ ఆక్రమణలను అరికట్టడంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలన్నారు. జోగిపేట -అకోలా జాతీయ రహదారి 161 పై చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, అండర్ పాస్ లు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా చర్యలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టి, ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు సూచించారు. ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య ఆరోగ్యశాఖ వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలో కార్పోరేట్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలు ఉన్నాయన్నారు. వైద్యులు వైద్య సిబ్బంది ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మెడికల్ కళాశాల భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని, సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పి అశోక్, ఆయా శాఖల అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీకి నీలం మధు గుడ్‌బై

- కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం ఖరారు
- 15న గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరిక
- కార్యకర్తల అభీష్టం మేరకే: నీలం మధు ముదిరాజ్



నవతెలంగాణ-పటాన్ చెరు: ప్రజలకు మరింత సేవ చేయడానికి ప్రజా పాలనలో తాను సైతం భాగస్వామి కావాలని కార్యకర్తల అభీష్టం మేరకు బీఎస్పీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు నీలం మధు ముదిరాజ్ ప్రకటించారు. సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కార్యకర్తల సలహాలు సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో నిర్వహించిన ప్రజా పాలనలో భాగస్వామిగా పాలుపంచుకొని ప్రజలకు మరింత సేవ చేయాలని తలంపుతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈనెల 15న తన వెంట నడుస్తున్న నాయకులు, కార్యకర్తలు,ఎన్ఎంఆర్ యువసేన సభ్యులతో గాంధీభవన్ లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ దీప్దాస్ మున్షి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. 6 గ్యారంటీలతో ప్రతి ఇంటికి సంక్షేమం జరుగుతుందన్న తలంపుతో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న పాలన పట్ల ఆకర్షితులమై కార్యకర్తల ఆదేశాల మేరకు కాంగ్రెస్ లో చేరడానికి నిర్ణయం తీసుకున్నట్లు పునరుద్ఘాటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ ఇచ్చి ప్రోత్సహించిన బీఎస్పీ పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ లో చేరిన వెంటనే అందరితో కలుపుగోలుగా ఉంటూ కలిసికట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు మరింత సేవ చేయడానికి ప్రణాళిక బద్ధంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.ఏఐసీసీ తో పాటు టీపిసిసి, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ బలోపేతం కోసం తనవంతుగా పాటుపడతానని ఈ సందర్భంగా మధు తెలియజేశారు.

నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ- సదాశివపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల నిత్యవసరాల ధరలు విపరీతంగా పెరిగాయని సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఈ నెల 16న జరిగే సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని జయపద్రం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయకూడదన్నారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి భూషణం వ్యవసాయ కార్మిక సంఘం సంఘం మండల కార్యదర్శి యోసెఫ్ , ప్రైవేట్ బస్సు డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ ప్రైవేట్ బస్సు డ్రైవర్ యూనియన్ నాయకులు ఎండీ.మై బలి, శేఖర్, నర్సింలు గౌడ్, బి. రాజు, శ్రీనివాస్, జగన్, రాజిరెడ్డి, పాపయ్య పాల్గొన్నారు.

సానిటరీ ఇన్స్పెక్టర్ విజయ్ బాబును ఉద్యోగం నుంచి తొలగించాలి

- తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పాపాల భైరవుడు అయిన అదనపు సానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబుని ఉద్యోగం నుంచి తొలగించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపల్‌లో అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తూ వారి స్థానంలో సానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబు సొంత బామ్మర్ది కుటుంబ సభ్యులను నల్గొండ నుంచి తీసుకొచ్చి ఇక్కడ ఉద్యోగం ఇస్తూ కొంతమంది కార్మికులను తొలగించడం చాలా దారుణమని అన్నారు. ఉద్యోగాలు పోవడంతో కార్మికుల కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ మాత్రం ఇప్పటివరకు ఆయన పైన చర్య తీసుకోకపోవడం చాలా దారుణం అని మండిపడ్డారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటే మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం కావాలి కానీ ఆయనకు మాత్రం మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం అవసరం లేదన్నారు. విజయబాబు ఒరిజినల్ పోస్టింగు హెల్త్ అసిస్టెంట్ కమిషనర్‌కు అనుకూలంగా కొన్ని పనులు చేయడంతో ఆయనకు శానిటరీ ఇన్స్పెక్టర్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. లక్షల రూపాయలు తీసుకొని ఈ పాపాల భైరవుడు ఉద్యోగాలు ఇస్తున్నాడని విమర్శించారు. సానిటరీ ఇన్స్పెక్టర్ విజయ్‌బాబు ఉద్యోగం నుంచి తొలగించకపోతే ఈనెల 16 నుంచి విధులు బహిష్కరిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. ఒక కార్మికురాలు 5 నెలల నుండి మున్సిపల్‌లో పనిచేస్తే ఆమెకు వేతనాలు ఇవ్వలేదు కానీ ఆమె స్థానంలో డబ్బులు తీసుకొని వేరోళ్ళకు ఉద్యోగం ఇవ్వడంతో ఇప్పుడు నెలకు వేతనాలు వస్తున్నాయని గుర్తు చేశారు. కార్మికురాలిని ఇంటికాడికి రమ్మని వేధింపులకు దిగుతున్నాడన్నారు. రాకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తానని విజయబాబు అంటున్నాడన్నారు. వెంటనే ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభువు, కిరణ్, రమేష్ గౌడ్, అనిల్, గణేష్, రాజు పాల్గొన్నారు.

సీఎంహెచ్ లాబరేటరీస్ పరిశ్రమ రియాక్టర్ పేలీ అగ్ని ప్రమాదం

- ఒకరి పరిస్థితి విషమం, ముగ్గురుకి గాయాలు
- రెండు ఫైర్ ఇంజన్లతో మంటలు అర్పున్న ఫైర్ సిబ్బంది



నవతెలంగాణ - పటాన్ చెరు

పాశం మైలారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో రియాక్టర్ పేలి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది అగ్ని ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి గాయాలైన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని పాశ మైలారం పారిశ్రామిక వాడలోని సి ఎం హెచ్ లాబోరేటరీస్ పరిశ్రమలో మంగళవారం రాత్రి పదిమంది కార్మికులు పనిచేసే చోట పదిమంది కార్మికులు ప్రమాదవశాత్తు రియాక్టర్ పేలింది. రియాక్టర్ పేలడంతో ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. పక్కనే ఉన్న మరో పరిశ్రమ వనమాలి పరిశ్రమలో అగ్ని కీలలు పడి మంటలు వ్యాపించాయి. రియాక్టర్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఒరిస్సా కు చెందిన గోయదర్ రావు (52) బీదర్ చెందిన దత్తు (35) బాపట్ల కు చెందిన పటాన్ కాలేష వాలి (28)లకు గాయాలు కాగా మొంటు మాలిక్ (28)కు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్ లో హుటాహుటిన పటాన్ చెరు పట్టణంలోని



ధ్రువ ఆసుపత్రికి తరలించగా, గాయాలైన ముగ్గురిని ఇస్నాపూర్ లో గల కాకతీయ ఆసుపత్రికి తరలించారు.మొంటు మాలిక్ పరిస్థితి విషమంగా ఉంది. అదేవిధంగా మంటలు ఆర్పేందుకు వెళ్లిన మరో నలుగురికి ఆక్సిజన్ అందక అపస్మారక స్థితికి వెళ్లారు. దీంతో వారిని ధృవ హాస్పిటల్ కు తరలించారు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎలాంటి భూమి ఆక్రమించలేదు

- నిరూపిస్తే దేనికైనా రెడీ
- షేర్‌ఖాన్‌పల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ



నవతెలంగాణ- హత్నూర

ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న తనను గ్రామకంఠం భూమి కబ్జా చేశానని ఆరోపించడంపై షేర్ ఖాన్ పల్లి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామ శివారు గ్రామకంఠం భూమి కబ్జా చేసిన వాళ్లే కంప్లైంట్ చేస్తూ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దౌల్తాబాద్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎటువంటి భూమి కబ్జా చేయలేదని చేసి ఉంటే చట్టపరమైన ఈ చర్యల కైనా సిద్ధమని లేనియెడల తనను బదలాం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. 124 సర్వే నెంబరు పట్టా భూమి అని దానిని గ్రామకంఠంగా చూపిస్తూ ఆఫీసర్లకు కంప్లైంట్ చేయడం కబ్జా అంటూ ప్రచారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీ వాగ్దేవి హై స్కూల్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-ఐడీఎ బొల్లారం

ఆహా ఏమి రుచి అనరా మైమరచి అనే సినిమా పాటను మై మరిపించే విధంగా పలు రకాల వంటకాలను తయారు చేసి బొల్లారం లోని శ్రీ వాగ్దేవి హై స్కూల్ ప్రదర్శించారు. మంగళవారం శ్రీ వాగ్దేవి హై స్కూల్ కరస్పాండెంట్ ఉదయ్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ రకాల ఆధునిక, సాంప్రదాయ వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు జంక్ ఫుడ్ తో పోషకాలు ఉన్న ఆహారాన్ని మరిచిపోతున్న ప్రస్తుత తరుణంలో సాంప్రదాయ, ఆర్గానిక్ ఫుడ్ వంటకాల ప్రాధాన్యతను తెలిపేందుకే ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయ బృందంతో పాటు పలు ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్ హాజరయ్యారు.

16న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.నర్సిములు

నవతెలంగాణ- కంది

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16 న నిర్వహించే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు కోరారు. మంగళవారం మండలంలోని చెర్ల గూడెం, తోపుగొండ, చేర్యల్ గ్రామాలలో కరపత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలైనా కార్మికుల, రైతుల, కూలీల, ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. అచ్చేదిన్, మేకిన్ ఇండియా అంటూ మోసపూరిత నినాదాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటికీ హామీలు అమలు కాలేదని అన్నారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షల రూపాయలు అకౌంట్‌లో జమ చేస్తాం, ధరలు తగ్గిస్తాం,రైతులను ధనవంతులను చేస్తామని అని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, రాజ మల్లయ్య, నవెందర్, మల్యయ్య కిరణ్ పాల్గొన్నారు.



నూతన ఎంపీడీవోగా యాదగిరి గౌడ్

- పంచాయితీ కార్యదర్శుల సన్మానం



నవతెలంగాణ-పటాన్ చెరు

పటాన్ చెరు నూతన మండల అభివృద్ధి అధికారిగా యాదగిరి గౌడ్ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతము ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీవో బన్సీలాల్ రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల ఎంపీడీవో గా బదిలీపై వెళ్లగా, నల్గొండ జిల్లా నార్కట్ పల్లి ఎంపీడీవో గా విధులు నిర్వర్తించిన జి యాదగిరి గౌడ్ బదిలీపై పటాన్ చెరు మండల ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆయనను. ఈ సందర్భంగా ఎంపీడీవో యాదగిరి గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధి తో పాటు సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ హరి శంకర్ గౌడ్, సూపర్ డెంట్ వెంకటేశం, శ్రీనివాస్, శ్రీధర్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రిజ్వాన్, ప్రవీణ్, రాజేందర్ పెద్దలు పాల్గొన్నారు.

మెట్రో లైన్‌ను సంగారెడ్డి వరకు పొడిగించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



నవతెలంగాణ-సంగారెడ్డి

మెట్రో లైన్‌ను మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు పొడిగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎం రఘునందన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు, గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ గతంలో కూడా బీజేపీ ఆధ్వర్యంలో మెట్రో ట్రైన్‌ను సంగారెడ్డి వరకు పొడిగించాలని అనేక ధర్నాలు నిర్వహించమన్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి వరకు పొడిగించాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆనాడు కోరడం జరిగిందన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి సంగారెడ్డి వరకు మెట్రో రైలు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, సంగప్ప, పులిమామిడి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు రాజశేఖర్ రెడ్డి, కులకర్ణి, మాణిక్ రావు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్ పాల్గొన్నారు.

అధిక బిల్లు వేయడం పట్ల ఆందోళన



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

ఖేడ్లోని ఎస్ఆర్ఆర్ మార్ట్ కొనుగోలు చేసిన సామాగ్రి కన్నా రెట్టింపుకు పైగా బిల్లు వేయడంతో కొనుగోలుదారుడైన బాధితుడితో పాటు కొందరు స్థానికులు మార్ట్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఖేడ్ మండలం పంచగామకు చెందిన విఠల్ సోమవారం మార్ట్కు వచ్చి రూ.2,800లకు సంబంధించిన పలు వస్తు, సామాగ్రిని కొన్నాడు. కౌంటర్ వద్దకు వెళ్లగా రూ.4,198లకు సంబంధించిన బిల్లు వేయడంతో అవాక్కయ్యాడు. ఇదేమిటని ప్రశ్నించినా మార్ట్వారు పట్టించుకోకపోవడంత శ్రీ స్థానికులు కొంతమంది కలిసి నిలదీశారు. దీంతో మార్ట్వారు అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేశారు. ఈవిషయమై మార్ట్ మెనేజరు రాజేషుశ్వాహను ప్రశ్నించగా సాఫ్ట్వేర్ సమస్య రావడంతో అధిక బిల్లు వచ్చిందని తెలిపాడు. 100 గ్రాముల పిస్తా కొనగా సాఫ్ట్వేర్ సమస్యతో కిలోగా నమోదై అధిక బిల్లు వచ్చిందన్నారు. ఎక్కువగా తీసుకున్న మొత్తాన్ని తిరిగి చెల్లించామని తెలిపాడు.

19 సార్లు ఏబీ పాజిటివ్ రక్తదానం చేసిన సయ్యద్ సజీద్ సుహాన్



నవతెలంగాణ-సంగారెడ్డి

యశోద అస్పత్రిలో 19వ సారి ఏబీ పాజిటివ్ రక్త దానం చేసి మా నవత్వం చాటుకున్నాడు సంగారెడ్డి మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సయద్ సజీద్ సుహాన్ గ్యానేశ్వర్‌రావు అనే వ్యక్తి గుండె సంబంధించిన సమస్యతో యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు గుండె ఆపరేషన్ కోసం ఏబీ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ అవసరం అని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే సంగారెడ్డి మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ సజీద్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే రక్త దానం చేస్తాను అని యశోద హాస్పిటల్‌కి వెళ్లి రక్త దానం చేశాడు. ఈ సందర్భంగా సయ్యద్ సజీద్ మాట్లాడుతూ బీపీ, షుగర్, అనారోగ్య సమస్య లు లేని వారు 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకు ఎవరైనా రక్త దానం చేయడానికి అర్హులు అని అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి రక్త దానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. తను ఇప్పటి వరకు 19 సార్లు రక్త దానం చేశానని తెలిపారు. రక్త దానం చేసి ప్రాణ దాతగా నిలిచినా సజీద్ కుటుంబ సభ్యులు రవి కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


15న సేవాలల్ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్‌లోని సేవాలాల్ చౌకును ఈ నెల ఈనెల 15న జరగనున్న 285 జయంతి పురస్కరించుకొని సేవాలాల్ సేవకు రంగురంగులతో ముస్తాబు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సేవాలల్ జయంతి కార్యక్రమాన్ని బీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని బీ ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహన్ అన్నారు. 15న జయంతి రోజున భోగుబండారు కార్యక్రమం సంస్కృతి కార్యక్రమాలు ఉద్యోగస్తులతో నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సేవాలాల్ జయంతి కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గం లోని ఉద్యోగస్తులందరూ అభిమానులు, యువకులు, విద్యావంతులు, మేధావులు హాజరై సేవాలాల్ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. టీబీ ఈఎస్ఎస్ సంఘం, బీ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకై కృషి చేయాలి

- ప్లాస్టిక్ నిషేధం పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ - మునిపల్లి

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయడం మన అందరి బాధ్యత అని మునిపల్లి మండల అభివృద్ధి అధికారి, బుదేరా స్పెషల్ ఆఫీసర్ హరి నందన్ రావు అన్నారు. బుదేరా గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగించడం వలన అనారోగ్య సమస్యల బారిన పడటం వాతావరణ కాలుష్యం తదితర అంశాలను విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బుదేరా గ్రామపంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కొండాపూర్

వికలాంగుల జాతీయ హక్కుల వేదిక క్యాలెండర్ ను కొండాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ హరి శంకర్ మంగళవారం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయనను శాలువతో సన్మానించారు. కొండాపూర్ మండల్ ప్రెసిడెంట్ సుధాకర్, ఉపాధ్యక్షులు వెంకయ్య, కొండాపూర్ సిపిఎం పార్టీ కార్యదర్శి రాజయ్య పాల్గొన్నారు.

కుంగ్ ఫు ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ సాధించిన ప్రతిభ హై స్కూల్



నవతెలంగాణ -జిన్నారం

జిన్నారంకు చెందిన ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు కుంగ్ ఫు ఇంటర్నేషనల్ చంపియన్షిప్ సాధించారు. ఈ మేరకు హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరిగిన న్యూ డ్రాగన్ ఇంటర్నేషనల్ కుంగ్ ఫు పోటీల్లో ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ కు చెందిన విద్యార్థులు లోహిత్ కుమార్ ,లాస్య, అక్షయ, ప్రశాంత్ లు వివిధ విభాగాల్లో మార్షల్ ఆర్ట్స్ కు సంబంధించిన కళా నైపుణ్యాలతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్ సాధించారని ప్రిన్సిపల్ సారా శ్రీనివాస్ తెలిపారు. మాస్టర్ బెస్త నరేష్ ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన నిర్వహించి డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచి గ్రాండ్ మాస్టర్ డి కంటేశ్వర్, నరేష్ చేతుల మీదుగా విజేతలుగా నిలిచిన ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు ఛాంపియన్షిప్ ను, మెడల్స్ ను, సర్టిఫికెట్స్ ను అందుకున్నారు. ఇంటర్నేషనల్ లెవెల్ లో మార్షల్ ఆర్ట్స్ కుంగ్ ఫు పోటీల్లో విజేతలు లాస్య లోహిత్ కుమార్, అక్షయ, ప్రశాంత్ లను ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడం ఆనందంగా ఉందంటూ అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



నవతెలంగాణ - ఝరాసంగం

మండల కేంద్రమైన ఝరాసంగంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య అధికారిని గాయత్రి దేవి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలో నెలలో ఎన్ని ప్రసవాలు జరిగాయని సిహెచ్ఓ సుదర్శన్ కు అడుగగా సరైన సమాధానం ఇవ్వక పోవడంతో ఆయన పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేలా కృషి తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఏ సమస్యపై వచ్చారని అడిగి తెలుసుకున్నారు. మహిళా ఆరోగ్య మేళా కార్యక్రమం ఏ విధంగా కొనసాగుతుందనే విషయం తెలుసుకునేందుకు రావడం జరిగిందన్నారు. జిల్లాలో 246 సబ్ సెంటర్లు ఉండగా అందులో 150 ఎంఎల్ పిహెచ్ లు విధులు నిర్వహిస్తున్నరన్నారు. ఆమె వెంట స్థానిక డాక్టర్ గోపి, సిహెచ్ఓ సుదర్శన్ ఉన్నారు.

అడవులు, పల్లెలకు హాని కలిగించే డంపు యార్డు ఏర్పాటు చేయొద్దు

- మంత్రి దామోదర్ రాజనర్సింహకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతి



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అడవి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడానికి అధికారులు పూర్తిస్థాయిలో అనుమతులు ఇచ్చినప్పటికీ ఆ చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు నిరాకరించడంతో పాటు జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అట్టి డంపు యాడ్ నిర్మాణం పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలో డంపు యాడు ఏర్పాటు కొరకు అనుమతులు జారీ చేసినప్పటికీ రైతుల ప్రభుత్వమైనటువంటి కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ పంట పొలాలకు హాని కలిగించే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా నిలిపివేయడానికి సంబంధిత అధికార యంత్రాంగానికి ఆయా పంచాయతీల తీర్మానాల ను సంబంధిత శాఖ అధికారులకు అందజేసినట్లు సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మద్ది ప్రతాప్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, కానుకుంట తాజా మాజీ సర్పంచ్ బెకు నీలమ్మ, పడమటి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ-కంగి: సంక్రాంత్రి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన కంగ్టి కస్తూరిబా పాఠశాలలోఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో నెగ్గిన విద్యార్థులకు స్థానిక తహసీల్దార్ విష్ణు సాగర్, డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ బహుమతులు అందించారు. మొదటి బహుమతి 10వ తరగతి ఎస్, సలోమి, ద్వితీయ బహుమతి, బి.నందిని 8 వ తరగతిలకు బహుతులు అందించి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎప్పుడు ఉద్యమాలు, పోరాటాలే కాకుండా విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల మానసిక ఉల్లాసాన్ని, ఉత్సహాన్ని కలిగించి నట్లవుతుందని అన్నారు. ఆటలే కాకుండ పదవతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ లాంటివి నిర్వహించి వారిలో దాగి ఉన్న సృజనత్మను వెలికి తీస్తుంద ని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ మండల అధ్యక్షులు పవన్, కేవీపీ ఎస్ మండల అధ్యక్షులు రాహుల్ పాఠశాల ఎస్ ఓ, వీరమణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నల్గొండకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ - న్యాల్‌కల్: మాజీ సీఎం కేసీఆర్ తలపెట్టిన నల్గొండలో బీఆర్ఎస్ బహిరంగ సభకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో బస్సులలో బయలు దేరిన మండలంలోని ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు సభకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు వారిలో పార్టీ అధ్యక్షులు రవీందర్, మాజీ సర్పంచులు రవికుమార్, నిరంజన్ రెడ్డి, తుక్కారెడ్డి, చంద్రప్ప, సుధాకర్ రెడ్డి, వడ్డే సంగమేష్ వెళ్లారు.

గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేద్దాం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలో సీసీ రోడ్లతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి బాట వేస్తాయని అందరి సహకారంతోనే రేజింతల్ గ్రామపంచాయతీకి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రేజింతల్ ఎంపిటిసి నల్లవల్లి మల్లికా శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం రేజింతల్ గ్రామంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో ఎంపిటిసి నల్లవల్లి మల్లికా శ్రీనివాస్ రెడ్డి గ్రామ స్పెషలాఫీసర్ రాజిరెడ్డి గ్రామ నాయకులతో కలిసి సీసీ రోడ్డు పనులు టెంకాయలు కొట్టి ప్రారంభించారు . కార్యక్రమంలో స్పెషలాఫీసర్ రాజిరెడ్డి, గ్రామ నాయకులు ఆర్. శ్రీకాంత్ రెడ్డి, సిరాజోద్దీన్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మైముద్ అలీ, సంగప్ప, విష్ణు, నర్సింలు, సైపోద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-హత్నూర

హత్నూర మండలం మధిర గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన కుటుంబాన్ని బీఎస్పీ ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు పరామర్శించారు. అగ్ని ప్రమాదాలు జరగడం దురదృష్ట కరమని అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన నిరుపేదరాలైన తలారి సునీత కుటుంబాన్ని అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని బిఎస్పీ మెదక్ జిల్లా మాజి అధ్యక్షులు కుతాడి నర్సింలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. సిలిండర్లు పేలుడు లాంటి సంఘటనలు జరుగకుండా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా నిరక్షరాస్యత ఉండటం వలన గ్యాసు ఆయిల్ కంపనీలు అందించే ప్రమాద భీమా పాలసీ పైన కూడా అవగాహన కల్పించాలని కోరారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన తలారి సునీతని ప్రభుత్వం వెంటనే ఆదుకొని తక్షణం సహాయం కింద రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆమెకు ప్రభుత్వం ఇళ్ల నిర్మించు కోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గ అధ్యక్షులు జనార్ధన్ గౌడ్, ఇంచార్జ్ శాంతి కుమార్, స్వరో జిల్లా నాయకులు శ్రీధర్ పవన్ కళ్యాణ మండల్ అధ్యక్షులు పవన్ కుమార్, రవి గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ అక్షయ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-సంగారెడ్డి: ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలలో సంగారెడ్డిలోని శ్రీ అక్షయ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వివేక్ 100 పర్సంటైల్ కు 97.76 పర్సంటైల్ స్కోర్ ఉత్తమ స్థానం సాధించాడు, కమ్మరి వంశీకృష్ణ 92.76 పర్సంటైల్ స్కోర్ చేశాడు, జేమ్స్ 92.76 పర్సంటైల్, సాయినాథ్ 92.20 పర్సంటైల్ స్కోర్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరచడం మాకెంతో గర్వకారణమని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషిచేసిన బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వీరప్ప, ప్రిన్సిపాల్ శ్రీశైలం, డైరెక్టర్లు భానుచందర్ రెడ్డి, రాజు గౌడ్, సుధాకర్ జోష్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్‌కు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

బీఆర్ఎస్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్ కు మెదక్ ఎంపీ స్థానాన్ని ఇవ్వాలని బీసీ మైనార్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభు గౌడ్ కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. మెదక్ ఎంపీ టికెట్ ఇచ్చినట్లయితే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్న బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు తెలిపారు. సంగారెడ్డిలో నియోజకవర్గంలో 40ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు సేవ చేస్తూ వచ్చానని నా సేవలను గుర్తించి బీసీ నేత అయిన తనకు మెదక్ ఎంపీ అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని మాజీ సీఎం కేసీఆర్ ను కోరానని ప్రభుగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు హీరాలాల్, పరశురాం నాయక్, మల్లారెడ్డి, రవీందర్, బీసీ మైనార్టీ సంఘాల నాయకులు ఖార్ జిన్ సింగ్, వెంకటేశం, జావిద్, శ్రీనివాస్, రాములు యాదవ్, అంతయ్య సుధాకర్గౌడ్, దత్తు, కృష్ణ ఉన్నారు.

రామాయంపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు

నవతెలంగాణ-రామాయంపేట



న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రామాయంపేట మండల కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. స్థానిక రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన విజ్ఞాన సదస్సుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు హాజరయ్యారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, మహిళల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం తీసుకొచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు ప్రతినిధులు సిద్ధ గౌడ్, సిద్ధ రాములు, న్యాయవాదులు వినోద్, మధు కృష్ణ, సిఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ పరీక్షలపై అవగాహన సదస్సు

నవ తెలంగాణ-మెదక్ టౌన్

కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్, మ్యాథమెటిక్స్, క్యారియర్ గైడెన్సి సెల్, టీఎస్‌కేసి సంయుక్త ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఐసెట్ ప్రవేశ పరీక్షపై అవగాహణ కల్పించామని ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రిసోర్స్ పర్సన్‌గా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మహేష్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తృతీయ సంవత్సరం పాసైన తర్వాత ఉన్నత చదువులకు ఏ విధంగా ప్రిపేర్ కావాలో తగిన సలహాలను ఇచ్చారు. ఐసెట్ పరీక్షలో ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల కోసం సన్నద్ధమయ్యే విద్యార్థులు ఏ విధంగా ప్రిపేర్ కావాలో తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఎంబీఏ, ఎంసీఏ చదువులకు మంచి పోటీ ఉంటుందని, ఇవి చదివిన విద్యార్థులకు ప్రైవేట్ సెక్టార్లో ఉన్నత ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని వాణిజ్య శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్ కుమార్, తిరుమలరెడ్డి, వెంకటేశ్వర్లు, మురళి, హరిత, నిదర్శిని, ఉగ్గి అంజయ్య పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

- 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-మనోహరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారులకు వచ్చి పది సంవత్సరాలైనా కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. అచ్చేదిన్ ఆయేగా, మేకిన్ ఇండియా అంటూ మోసపూరిత నినాదాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నేటికీ ఏం చేయలేకపోయారన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు, పేద కుటుంబానికి రూ.15 లక్షల రూపాయలు అకౌంట్‌లో జమ చేస్తాం, ధరలు తగ్గిస్తాం అని హామీ ఇచ్చి పది సంవత్సరాలైనా నేటికీ అతి గతి లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు సహజ వనరులను కార్పొరేట్లకు అప్పజెప్పిందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల మీద దాడి చేసి నాలుగు లేబర్ కోడ్ తెచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేసిందని విమర్శించారు. రైతాంగానికి ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం రైతులను మోసం చేసి నల్ల చట్టాలు తీస్తే చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరం పాటు పోరాటం చేసి మోడీ మెడలు వంచిన చరిత్ర రైతాంగానికి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదలను ఆదుకోవడం కోసం యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి చట్టాన్ని తెస్తే.. మోడీ



ప్రభుత్వం చట్టాన్ని నిర్వర్యం చేస్తూ కూలీలకు ఉపాధి లేకుండా నిధులు తగ్గించి వ్యవసాయ కూలీల పుట్టగొడుతుందన్నారు. ధరలు విపరీతంగా పెంచి మధ్యతరగతి ఉద్యోగులను ప్రజలను నడ్డి విడిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన రోజులు దగ్గరలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించి మోడీకి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రాంతం కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కూలీలు, గ్రామీణ బంద్ నిర్వహించి ఎక్కడికక్కడ దిగ్బంధం చేసి మోడీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

బ్యాంక్ లింకేజిలో రాష్ట్రంలో మెదక్ ప్రథమ స్థానం

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

గ్రామీణ అభివృద్ధి సంస్థ బ్యాంక్ లింకేజిలో రాష్ట్రంలో మెదక్ ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2023వ త్రైమాసికానికి సంబంధించి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 100 శాతం లక్ష్యం సాధించి, రాష్ట్రంలో ప్రథమ స్థానం రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. పట్టణ అభివృద్ధి సంస్థ 100 శాతం లక్ష్యం సాధించిందన్నారు. మొత్తం రుణ ప్రణాళికలో వ్యవసాయ, వ్యాపార, ముద్ర, వీధి విక్రేతలకు, మహిళ, యువతకు, ఉపాధి కోసం ఋణాలు పంపిణీ చేశామన్నారు. మొత్తం ఋణ ప్రణాళికలో 3796.28 కోట్ల లక్ష్యానికిగాను 2874.32 కోట్ల లక్ష్యం సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం రావడం గొప్ప విషయమన్నారు. అనంతరం 2024-2025వ సంవత్సరానికి నాబార్డ్ బ్యాంక్ సౌజన్యంతో రూపొందించిన పోటేన్సియాల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, మెప్మా పిడి ఇందిరా, జిల్లా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి విజయ లక్ష్మి, జిల్లా లీడ్ మేనేజర్ పియస్ మూర్తి, జిల్లా లీడ్ అధికారి రెహ్మాన్, నాబార్డ్ డిడిఎం తిమోతి, ఎస్బిఐ రిజనల్ మేనేజర్ అరుణ జ్యోతి, ఏపిజివిబి రీజినల్ మేనేజర్ ఉదయ్ కిరణ్, ఇతర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి




నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామపంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ అన్నారు మంగళవారం మనోహరాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి గారికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న తమకు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారుతుందని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు కార్మికులకు మూడు నెలల వేతనాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారన్నారు. ప్రభుత్వ అధికారులకు మాత్రం ఒకటవ తేదీన జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర బడ్జెట్ ఉంది కానీ వర్కర్లకు ఇవ్వడానికి లేదా అని ఆయన మండిపడ్డారు యొక్క కార్యక్రమంలో స్వామి ఎల్లమ్మ నవనీత శోభ తదితరులు పాల్గొన్నారు

హజరత్ షాహిద్ అల్లా దర్గా ఉర్సు ఉత్సవాలు

నవ తెలంగాణ-టేక్మాల్



టేక్మాల్‌లో బుధవారం సాయంత్రం ఉరుసు ఉత్సవాలు నిర్వహించినట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హుసేని హుసేని ఖాద్రి తెలిపారు. భగవంతుడు దృష్టిలో మానవులు అందరూ సమానులేనని చాటిచెప్పిన హజరత్ షాహిద్ అల్లా ఖాద్రి ఉర్సు ఉత్సవాలు ఈ నెల 13, 14,1 5వ తేదీలలో జరుగుతాయన్నారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జరుగుతాయన్నారు. టేక్మాల్ కేంద్రంలోని కింది వీధి నుంచి గంధం చాదర్‌ను ప్రత్యేక ప్రార్థనలతో ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలో సమర్పిస్తారు. దర్గాను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తారు. ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని మెదక్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మజహర్ ఎంఎ సలీం కోరారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ, రజాక్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్ గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన నందిగామ గ్రామంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పనులను పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న డీజిటల్ అక్షరాస్యత సర్వేను పరిశీలించారు. రజాక్ పల్లిలో గ్రామ పంచాయితీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శులు ఆరిఫ్ హుస్సేన్, గీతాంజలి, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిపిఓ బదిలీ.. సన్మానించిన సెక్రటరీలు



నవతెలంగాణ - మెదక్

మెదక్ జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబాను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న డిపిఓను పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు జే. నగేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ ఇంతకాలం తనకు సహకరించిన పంచాయతీ కార్యదర్శులకు అభినందించారు.

జెడ్‌పిహెచ్‌ఎస్‌లో స్వయంపాలన దినోత్సవం

నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వయంపాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంగా ఆర్ కావ్య, డీఈవోగా రామచంద్రన్, ఆర్డీఓగా లోహిత, కలెక్టర్‌గా కోమల్, సర్పంచ్ గా సిద్ధార్థ, జడ్పీ చైర్మన్‌గా భాను శ్రీ, ఎంపీపీగా జోత్స్న, ఎంఈఓ గా భానుప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ గా ప్రవీణ్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం కృపాకర్ రెడ్డి. ఉపాధ్యాయులు చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

అంగన్వాడీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జిల్లా కార్యదర్శి నర్సమ్మ

నవతెలంగాణ-మెదక్



అంగన్వాడీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు డిసెంబర్, జనవరి నెలల వేతనాలు చెల్లించక పోతే ఏమి తిని పని చేస్తారని ప్రశ్నించారు. గ్రామాలలో తల్లులకు, గర్భవతులకు, పిల్లలకు పోషకాహారం అందించే వారికి ప్రతి నెల వేతనాలు చెల్లించకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే వారికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు వేతనాలు చెల్లించి మెదక్ జిల్లాకు చెల్లించక పోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి డిసెంబర్, జనవరి నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది యాదమ్మ, ప్రమీల, భవాని, సుగుణ, మంగ, వీరమ్మ, ఉన్నిస, భాగ్య లక్ష్మి, కమల, స్వరూప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు లేని పల్లె ఉండొద్దు

- నియోజక వర్గాన్ని అభివృద్ధి పర్చడమే నా లక్ష్యం
- మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

నవతెలంగాణ -పాపన్నపేట



మెదక్ నియోజక వర్గంలో రోడ్డు లేని పల్లె ఉండొద్దనే లక్ష్యంతో పని చేస్తున్నామని మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. నాబార్డు నిధులతో నియోజక వర్గంలోని పాపన్నపేట మండలం పొడ్చంపల్లి తాండాలో మంగళవారం మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ కొబ్బరి కాయ కొట్టి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ నియోజక వర్గంలో రోడ్డు లేని పల్లెటూరు ఉండొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ



నవతెలంగాణ-వెల్దుర్తి

నాబార్డ్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ రమేష్ గౌడ్, వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, ఐకెపి ఎపిఎం శంకరయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం 20 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతిరోజు 50 రూపాయల చొప్పున చెల్లించి, ఉచిత మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన అనంతరం ఇంటి వద్ద కాని, ఎక్కడైనా షాపు పెట్టుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. శిక్షణకు మహిళలు ప్రతిరోజు హాజరవుతూ మగ్గం వర్క్ నేర్చుకోవాలని సూచించారు. బ్యాంకులో నుంచి రుణాలు తీసుకొని జీవనోపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్లు వినయ్ సేనా, సిసి కిషన్, నాబార్డ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గోపీనాథ్ రెడ్డి మహిళలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.1.05 కోట్లు మంజూరు

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుహాసిని రెడ్డి

నవ తెలంగాణ-కౌడిపల్లి





సీసీ రోడ్ల నిర్మాణం కోసం కోటి 5 లక్షలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి, జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్‌లు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కింద మండలానికి సీసీ రోడ్ల నిర్మాణం కోసం కోటి 5 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కౌడిపల్లికి రూ.10 లక్షలు, రైలాపూర్ 5 లక్షలు, తిమ్మాపూర్ 5 లక్షలు, వెంకట్రావుపేట్ 5 లక్షలు, నాగ్సన్ పల్లికి 5 లక్షలు, వెంకటాపూర్ ఆర్ 5 లక్షలు, ముట్రాజ్ పల్లి 5 లక్షలు, బుజరంపేట్ 5 లక్షలు, కుకుట్లపల్లికి 5 లక్షలు, బూరుగడ్డ 5 లక్షలు, సదాశివపల్లి 5 లక్షలు, ధర్మసాగర్ 5 లక్షలు, తుంకి 5 లక్షలు, దేవులపల్లికి 5 లక్షలు. కొట్టాల 5 లక్షలు, వెల్మ కన్నె5 లక్షలు, రాజిపేట్ 5 లక్షలు, సలాబత్పూర్ 5 లక్షలు, కంచన్పల్లికి 5 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు.

మూడవ రోజు వెంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-రామాయంపేట



వెంకటేశ్వర ఏకాదశి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం మూడవ రోజు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయంలో ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని నేడు మూడవ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నల్గొండ సభకు తరలిన బీఆర్ఎస్ కార్యకర్తలు



నవతెలంగాణ-రామాయంపేట : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నల్గొండ బహిరంగ సభకు రామాయంపేట మండల కేంద్రం నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గజవాడ నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి సభకు బయలుదేరి వెళ్లారు.

చిలిపిచేడ్ ఎంపీడీవోగా ఆనంద్

నవతెలంగాణ-చిలిపిచేడ్



చిలిపిచెడ్ మండల నూతన ఎంపీడీవోగా బి.ఆనంద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా బీచ్ కుంద మండలంలో పనిచేసిన ఆనంద్ ప్రస్తుతం చిలిపిచేడు మండలానికి బదిలీపై వచ్చారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ప్రజలకు ఎల్లవేళలా పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన ఎంపీడీవో శశి ప్రభ బదిలీ అయ్యారు.

బీసీ కాలనీ అభివృద్ధే తమ ధ్యేయం



బీసీ కాలనీలో పర్యటించిన మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ- ఐడిఎ బొల్లారం

బీసీ కాలనీ అభివృద్ధే తమ ధ్యేయమని జిన్నారం మాజీ జడ్పీటిసి కొలను బాల్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం బీసీ కాలనీలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీలో పర్యటిస్తూ అక్కడ నెలకొన్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,రోడ్లు, మిషన్ భగీరథ నీళ్ల రానున్నాయిని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, పెద్ద ఎత్తున కాలనీ వాసులు పాల్గొన్నారు.

బిడేకన్నేలో గ్రామదేవతకు బోనాలు



నవతెలంగాణ - ఝరాసంగం

మండల పరిధిలోని బిడేకన్నే గ్రామ దేవత(ఊరడమ్మ)కు మంగళవారం గ్రామస్తులు వైభవంగా బోనాలు సమర్పించారు. మూడు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మొదటిరోజు అమ్మవారీ కళ్యాణం, రెండవ రోజు అన్నదానం, తదనంతరం గ్రామంలోని ఆడపడుచులు బోనాలను చక్కగా అలంకరించి గ్రామ పురవీధులలో డప్పు చప్పులు, పోతురాజుల విన్యాసాలతో గ్రామ దేవతకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంజీవ్, చెన్నారెడ్డి, దత్త్రాత్రి, కార్యక్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షులుగా విశ్వనాథం ఎన్నిక

నవతెలంగాణ -ఝరాసంగం



బీజేపీ మండల అధ్యక్షులుగా బంటు విశ్వనాథం ఎన్నికైనట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి బీజేపీ పార్టీ తనను మండల అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర నాయకులకు, జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డికి, జిల్లా కార్యదర్శులకు, మండల నాయకులకు, బూత్ స్థాయి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ అండ్ టీ టోల్ ప్లాజాలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ - మునిపల్లి

మండలంలోని కంకోల్ గ్రామ శివారులో గల టోల్ ప్లాజాలో 35వ జాతీయ రోడ్డు భద్రత వేడుకల్లో భాగంగా మంగళవారం టోల్ ప్లాజా సిబ్బంది, వాహన డ్రైవర్లకు, వాహన చోదకులకు వైద్యులు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ వైద్య శిబిరాలలో ముందస్తుగా ఆరోగ్య పరిక్షలు చేసుకోవడం వలన సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు. తద్వార సకాలంలో చికిత్స పొందవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టీ ప్రాజెక్టు హెడ్ రాజేష్ ప్రభాకర్ విచరి, విజయేందర్ రెడ్డి, టోల్ ప్లాజా సిబ్బంది, మునిపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది లారీ డ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.

నల్గొండ సభకు బయలుదేరిన బీరయ్య యాదవ్

నవతెలంగాణ-సంగారెడ్డి



కేంద్రం నుండి కృష్ణ గోదావరి సాగునీటి జలాల హక్కులను కాపాడు కునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో నల్లగొండ లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు బయలుదేరిన బీ ఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్, ఉస్మాన్ అలీ, అఖిల్, అంజద్, సాయిలు ఉన్నారు.

ఎల్లమను దర్శించుకున్న మైనంపల్లి



నవతెలంగాణ-రామాయంపేట

ఎల్లమ్మ దేవి వార్షికోత్సవ వేడుకల్లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాయంపేట మండల కేంద్రంలో రేణుకా మాత ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు మంగళవారం శ్రీ రేణుక మాత ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీ రేణుక మాత దేవాలయం వార్షికోత్సవ వేడుకల్లో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎనిశెట్టి అశోక్, ఎంపీటీసీ నాగులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-రామాయంపేట



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

ఎన్ఐటికి మైనారిటీ గురుకుల విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ పట్టణంలో గల మైనారిటి బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలకు చెందిన ఎం.నందిని 83.08, జి.సంధ్య 53.03 మార్కులు సాధించి ఎన్ఐటికి అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపక బృందం అభినందించారు.

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా ఫహీం



నవతెలంగాణ-మిరుదొడ్డి

మిడిదొడ్డి మండల పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీని మంగళవారం ఎంపిఓ జహీరుద్దీన్ సమక్షంలో మిడిదొడ్డి గ్రామ పంచాయతీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో అధ్యక్షులుగా మిడిదొడ్డి పంచాయతీ కార్యదర్శి ఫహీం , ఉపాధ్యక్షులుగా షబానా బేగం, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా రవీందర్, రవి, ఉషారాణి, తులసి, మహేష్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎఎన్నుకున్నందుకు పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని ఫహీం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రవీందర్, మమత, అశోక్ ఉషారాణి , సుమన్ రజిత తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

సికింద్రాబాద్‌లో జరుగుతున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయస్థాయి సమావేశానికి గజ్వేల్ నుంచి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి, ఎంఎస్ఎఫ్ జిల్లా బృందం భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మంగళవారం జరగనున్న ఈ సమావేశానికి మందకృష్ణ మాదిగ, కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి హాజరై ఎస్సీ వర్గీకరణపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముం ద్రాతి కృష్ణ మాదిగ, ఎంఎస్పి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పేర్క పరశురాములు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామాట్ ప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్క పల్లి రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బింగి పవన్ కళ్యాణ్, జిల్లా ఉపధ్యక్షుడు చెబార్థీ మహేష్, నాయకులు శ్రీహరి సింధు, ఉబ్బనీ ఆంజనేయులు, శంకర్, జితేందర్, శనిగిరి రమేష్, కొక్కొండ నర్సింహులు, మినుముల కరుణాకర్, పెరిక ప్రశాంత్, డాకాని రాజు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘాల పిలుపు
- మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత





నవతెలంగాణ-చేర్యాల

దేశ వ్యాప్తంగా ఈ నెల 16న జరిగే కార్మికుల సమ్మె జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ కార్మికులను కోరారు. చేర్యాల పట్టణ కేంద్రంలో మంగళవారం సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్‌గా ఏర్పడి ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 4 లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో కాల పరిమితి ముగిసిన అన్ని షెడ్యూల్ పరిశ్రమలకు వెంటనే కనీస వేతనం జీవోలు ప్రకటించి అమలు చేయాలని, గత ప్రభుత్వం 2021లో విడుదల చేసిన ఐదు కనీస వేతనాల జీఓలను గెజిట్ చేసి అమలు చేయాలని కోరారు. తదితర డిమాండ్లపై జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్ కుమార్, రాళ్లబండి భాస్కర్, రైతు సంఘం పట్టణ నాయకులు ముస్త్యాల ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ









నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం చిట్యాల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు కె.సంతోష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశ కార్యక్రమాలలో భాగస్వాములైనప్పుడు మాత్రమే అంతర్గతంగా దాగివున్న సృజనాత్మక లక్షణాలు బయటకు రావడానికి ఉపయోగపడతాయన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి, జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్ధారించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. రామకిషన్, నవిత, బి.నర్సింహులు, ఎస్.సత్యనారాయణ, డి.శ్రీనివాస్, ఎ.శారద, కొడిపల్లి ప్రశాంత్ కుమార్, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం బందారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధన చేశారు. డీఈవోగా హారిక, ఎంఈఓగా అనూష, ప్రధానోపాధ్యాయులుగా అనిల్ కుమార్ పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమానికి విశ్రాంతి ఉపాధ్యాయుడు మహేందర్ రెడ్డి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు పాఠశాలకు మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామచంద్రం, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాగ్యలక్ష్మి, ప్రభాకర్, సత్యనారాయణ, సుభాషిని, బాబు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలను బోధించి అబ్బురపరిచారు. దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట వార్డు జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులను దేశ భవిష్యత్తు నిర్ణయించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులు మాత్రమేనని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేయడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎండీ సాదత్ అలీ, పీ.శ్రీనివాస్ గౌడ్, పీ.వెంకట కృష్ణమాచారి, డీ.కృష్ణమూర్తి, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, కే.శ్రీకాంత్, బీ.నరేష్, పీ. బాలకృష్ణ, ఆర్.పద్మావతి, వీ.నరేష్, సీహెచ్.చంద్రశేఖర్, బీ.రాజేందర్, సీ.ఇందిర, ఏ.రేణుక, సీఆర్పీ టీ.నవీన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నిత్యం టీచర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వింటూ చదువుకునే చిన్నారులు వారే టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించి ఆకట్టుకున్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు జిల్లా విద్యాధికారిగా ఎండి సలీం, ఎంఈఓ నిఖిల్ తేజ, ప్రధానోపాధ్యాయులుగా వినయ్ రెడ్డి ఐదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు. ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయులు ప్రసాద్ గౌడ్, సుప్రజ, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు











నవతెలంగాణ-గజ్వేల్

కృష్ణా జలాలపై అధికార కాంగ్రెస్ పార్టీ తొండి గేమ్ ఆడుతుందని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం కేసీఆర్ తలపెట్టిన నల్లగొండ సభకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి బస్సులో స్థానిక కార్యకర్తలతో ఆయన బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడారు. జల వనరుల కోసమే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పచ్చి అబద్దాలు ఆడుతుందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం సాధించడానికి ప్రాణ త్యాగాలు చేయడానికి కూడా కేసీఆర్ వెనుకాడలేదన్నారు. కేసీఆర్ సాధించి పెట్టిన రాష్ట్రంలో పదవులు పొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పుడు కేసీఆర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో అధికార పార్టీ నాయకులకు లెక్కలతో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు బుద్ధి చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. లెక్కలు తెలిసిన వ్యక్తులు పదవుల్లో ఉంటే మంచిదని ఆయన పేర్కొన్నారు. నీళ్ల, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని వాటిని ఆంధ్ర రాష్ట్రానికి అప్పగిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో కృష్ణాజిల్లాలో తెలంగాణకు రావాల్సిన వాటాను సాధించేవరకు నిరంతరంగా పోరాటం సాగిస్తామని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్ చందు, ఉమర్ మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, బెండ మధు, రాజిరెడ్డి, రమేష్ గౌడ్, నవాజ్ మీరా, శివకుమార్, మోహన్ బాబు, భీమప్ప తదితరులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

నవతెలంగాణ-తొగుట

నాడు, నేడు ఎప్పుడైనా తెలంగాణకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రీ రామ రక్షగా నిలుస్తుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కృష్ణా నది హక్కుల పరిరక్షణ కోసం నల్గొండలో జరిగే బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వెళ్ల రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్ల, నిధులు, నియామకాలలో జరిగిన అన్యాయాలపై పోరాటం చేయడానికే టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు జరిగిందని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించబోమని కాంగ్రెస్ తీర్మానం చేయడం తెలంగాణ ప్రజలు, కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ సాధిం చిన విజయమని పేర్కొన్నారు. కృష్ణా జలాలపై కేసీఆర్ గొంతు విప్పడం వల్లే బీఆర్ఎస్ పార్టీ నల్లగొండలో సభ పెట్టబోతున్నది కాబట్టే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు అప్పగించలేదని, కానీ కాంగ్రెస్ వచ్చిన రెండు నెలల్లోనే అప్పగించడానికి అవసరమైన అన్ని సంతకాలు పెట్టి వచ్చారని విమర్శించారు. దీన్ని కప్పి పుచ్చుకునేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంత లొల్లి పెట్టినా, అరిచినా ఇది దాగని సత్యమని పేర్కొ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరంభంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందని, కరెంటు సక్రమంగా రావడం లేదని, హామీలను తుంగలో తొక్కారని, ఫించన్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, రైతుబం ధు మండల అధ్యక్షులు బోధనం కనకయ్య, ఎంపీ టీసీ కొమ్ము శరత్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చిలువేరి మల్లారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు మాదాసు అరుణ్ కుమార్, నాయకులు ఎం.చంద్రా రెడ్డి, సుతారి రమేష్, పాత్కుల వెంకటేశం, మంగ నర్సింహులు, ఎల్లం, భాస్కర్ గౌడ్, భిక్షపతి, అశోక్, వెంకట్, శ్రీనివాస్, అబిద్ హుస్సేన్, సుభాష్ గౌడ్, కొల కనకయ్య, స్వామి గౌడ్, అనిల్, బైరయ్య, రమేష్ గౌడ్, ఎల్లం, మహేష్, చంద్రం, రాంబాబు తదితరులున్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

నాగార్జునసాగర్ డ్యాంను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో నల్లగొండ సభకు మంగళవారం దుబ్బాక బీఆర్ఎస్ నేతలు తరలివెళ్లారు. బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తున్నామన్నారు. రైతాంగానికి మద్దతుగా మాజీ సీఎం, బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు చలో నల్లగొండ సభకు తరలివెళ్లడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి, గన్నె భూమిరెడ్డి, బండి రాజు, పడాల నరేష్, ఆస వినోద్, మండల నర్సింలు, చందు పలువురున్నారు.

నవతెలంగాణ-కొండపాక

నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కేసీఆర్ భారీ బహిరంగ సభకు కొండపాక మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ రాగల దుర్గయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కృష్ణా జలాలపై నీటి హక్కులు కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడాన్ని నిరసిస్తూ కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ నీటి సంపదను, హక్కులను కాపాడుకోవడానికి మళ్లీ కేసిఆర్ ఉద్యమం చేపట్టారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల కనకయ్య, పిడిశెట్టి శ్రీనివాస్, బారాస సీనియర్ నాయకులు పిల్లి నాగరాజు, గొట్ట ఐలయ్య, సున్నం భాస్కర్, ఏమల్ల రాజిరెడ్డి, యాటెల్లి మల్లయ్య, అర్జున పట్ల కనకయ్య, దొమ్మాట చంద్రశేఖర్, ముత్యంరావు, నీల వెంకటేశం, బందారం మాజీ ఉపసర్పంచ్ వెంకటేశం వెళ్లారు.

నవతెలంగాణ-చేర్యాల

కృష్ణానది ప్రాజెక్టుల పరిరక్షణకై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేర్యాల పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమట్ల సతీష్, ముస్త్యాల నాగేశ్వరరావు, అంకుగారి శ్రీధర్ రెడ్డి, ముస్త్యాల బాల నర్సయ్య, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సిద్దిరాములు గౌడ్, బురగోని తిరుపతి గౌడ్, పచ్చిమడ్ల మానస, అవుశెర్ల కిషోర్, పలువురు ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలలో మద్యం సీసాల తొలగింపు

- స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి







నవతెలంగాణ-బెజ్జంకి

పాఠశాలనా?...మద్యం సేవించే స్థలమా?అనే శీర్షికతో 'నవతెలంగాణ దినపత్రిక' మంగళవారం వార్తను ప్రచురించింది. వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి పాఠశాల అవరణంలో మద్యం సీసాల అనవాళ్లను గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో తొలగించారు. పాఠశాలలో చోటు చేసుకుంటున్న అసాంఘిక కార్యకలాపాలపై పంచాయతీ కార్యదర్శికి పాఠశాల బోధన సిబ్బంది తమగోడును వెళ్లబోసుకున్నారు. పాఠశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

అభద్రత వలయంలో బాలికల పాఠశాల

మండల కేంద్రంలో నడిబొడ్డున ఉన్న బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల అభద్రత వలయంలో కొట్టుమిట్టాడుతొంది. గత రెండు రోజుల క్రితం బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల భవనంలోని బోధన సిబ్బంది కార్యాలయ గది వెంటిలేటర్ అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి పగులగొట్టారు. మూత్రశాలకు రక్షణగా నిలిచే తలుపులకు రంద్రాలు చేశారు. దీంతో పాఠశాల మహిళ బోధన సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాలలో స్కావెంజర్స్, పీఈటీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనికితోడు బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల అవరణంలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం విస్మయానికి గురిచేస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాలికల ప్రభుత్వోన్నత పాఠశాలను సంరక్షించాలని బోధన సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

- ఏఈఓ శ్రీలత



నవతెలంగాణ-అక్కన్నపేట

రైతులు వ్యవసాయ అధికారులు చెప్పే సూచనలు పాటించాలని ఏఈఓ శ్రీలత అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని జనగామ గ్రామంలో పంట పొలాలను సందర్శించారు. వరి పొలాలను ఆశించిన మోగి పురుగును ఎలా నివారించుకోవాలో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, మందులు ఎక్కువగా వాడడం వలన భూమి ఉపరితలంపై ఉన్న పర్యావరణం కాలుష్యమవుతుందని, దీనివల్ల భూసారం తగ్గుతోందన్నారు. దీని ప్రభావం మనకి తెలీకుండానే భూమిలో ఉన్న జీవరాశులపై పడుతుందన్నారు. దీంతో వరిలో మోగి పురుగు ప్రభావం ఎక్కువవుందన్నారు. దీని నివారణకు కార్బో ఫ్యూరాన్ 3జీ గుళికలు, ఎకరాకు 10 కిలోలు వేసుకోవాలన్నారు. లేదంటే కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 50 ఎస్.పి మందును 2గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. 15 రోజుల తర్వాత 20కిలోల యూరియా చల్లుకోవాలి అన్నారు.

పదికి పది జీపీఏ సాధించి జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలి

- అడిషినల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్



నవతెలంగాణ-చేర్యాల

పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించి సిద్దిపేట జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని జిల్లా అడిషినల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. చేర్యాల మండలం దానం పల్లి గ్రామంలోని జడ్పిహెచ్ఎస్‌ను అడిషనల్ కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులను గణితంలో లెక్కలను అడిగి తెలుసుకున్నారు. అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పడంతో కె. వైష్ణవి అనే విద్యార్థినికి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరు ప్రతిరోజు పదో తరగతి స్పెషల్ క్లాసులకు రావాలని, అందరు 100% ఉత్తీర్ణత సాధించి జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని కోరారు. పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం) ప్రతిరోజూ 100% విద్యార్థుల హాజరు ఆప్‌లో తీసుకోవాల్సిందిగా పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ. మహబూబ్ అలీ, మండల విద్యాశాఖ అధికారి మొగుళ్ల నర్సింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు పీ.ప్రవీణ, ఉపాధ్యాయ బృందం, సిఆర్పి కనకరాజు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ అరుణపై దాడి అమానుషం



నవతెలంగాణ-సిద్దిపేట

అచ్చంపేట మార్కెట్ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు అయిత రత్నాకర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం వారు పట్టణంలో మాట్లాడుతూ ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్య వైశ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉండడం జీర్ణించుకోలేక కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమాజంలో అన్ని కులాలతో పాటు ఆర్య వైశ్యులకు కూడా రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందన్నారు. తుకాల్లో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే చైర్మన్‌కు, సెక్రటరీకి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. కొంత మంది కావాలని రైతులను రెచ్చగొట్టి ఆమెను కొట్టుకుంటూ దూషించడం చాలా అమానుషమైన చర్య అన్నారు. ఇప్పటివరకు ఎందరో అచ్చంపేట మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేశారని, కానీ ఏ మార్కెట్ కమిటీ చైర్మన్‌పై ఇలాంటి దాడి జరగలేదన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టేందుకు కూడా ఆర్యవైశ్యులు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉపాధ్యాయ పురస్కార గ్రహీతకు ఘన సన్మానం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామంచ రవీందర్ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న విషయం విధితమే. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల అవరణంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత రామంచ రవీందర్‌ను మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు రవీందర్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ, యూటీఎఫ్, డీటీఎఫ్ సంఘాల ఉపాధ్యాయులు వడ్లకొండ శ్రీనివాస్, నారోజు శంకరా చారి, శ్రీనివాస రావు, నిషాని రాములు, మాలతి, కవిత పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

నిరుపేద కుటుంబానికి చెందిన నిఖిల వివాహానికి పుస్తె మట్టెలు, చీర గాజులు అందజేసినట్లు మూడు క్లబ్బుల అధ్యక్షులు చకిలం రవి, అర్వపల్లి హరి కిరణ్, మర్యాల వాణిలు తెలిపారు. వాసవి క్లబ్స్ వారి ఆధ్వర్యంలో కోమరవెల్లి రాంప్రసాద్ మౌనిక దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో పుస్తెమట్టెలను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మర్యాల వీరేశం, ఇల్లందుల నాగేందర్, రాంప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జీవాలకు అమ్మ తల్లి సోకకుండా వ్యాక్సిన్ వేసుకోవాలి

- ఎంపీటీసీ చెట్కూరి కళ్యాణి కమలాకర్ యాదవ్



నవతెలంగాణ-మద్దూరు

గొర్రెలు, మేకలకు అమ్మ తల్లి సోకకుండా వ్యాక్సిన్ వేసుకోవాలని జాలపల్లి, అర్జున్ పట్ల, కమలాయపల్లి, ఎంపీటీసీ చెట్కూరి కళ్యాణి కమలాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో జీవాలకు అమ్మతల్లి సోకకుండా వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు తమ గొర్రెలు, మేకలకు అమ్మ తల్లి సోకకుండా ఉండేందుకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నిటి అసిస్టెంట్ రాజశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు

క్రీడాకారునికి ఆర్థిక సహాయం

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కీ వెంకటయ్య



నవతెలంగాణ-మిరుదొడ్డి

జూనియర్స్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ షాట్ పుట్ అండర్ 16 విభాగంలో ఎంపికైన బొమ్మనమైన రమేష్‌కు రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అందజేశారు. గుజరాత్ రాష్ట్రంలో అహ్మదాబాద్‌లో ఈనెల 16 నుంచి 19 వరకు జరుగుతున్న ఈ పోటీలకు భూంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రమేశ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలో జరగబోయే అథ్లెటిక్స్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి మన రాష్ట్రానికి, సిద్దిపేట జిల్లాకు, భూంపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పిఈటి వెంకటరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరేష్ పాల్గొన్నారు

ఆపన్న హస్త మిత్రబృందం ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లోని సమీకృత కూరగాయల మార్కెట్‌లో మంగళవారం ఆపన్న హస్త మిత్రబృందం ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఏసిపి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే ఏసిపి రమేష్ నేను సైతం అంటూ రక్త దానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పన్నహస్త మిత్రబృందం సేవలు అభినందనీయమన్నారు. వినూత్న సేవా కార్యక్రమాలలో మంచి గుర్తింపు తెచ్చుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆపన్న ఆస్తమిత్ర బృందం సేవలు మరింత విస్తృతం చేయాలని, రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడానికి అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపన్న అస్త మిత్ర బృందం నాయకులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 14 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

అధ్యాపకుల సమస్యలపై పోరాడుతున్న సంఘం టీఎల్ఎఫ్

నవతెలంగాణ- సిద్దిపేట



అధ్యాపకుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక సంఘం టీఎల్ఎఫ్ అని సంఘం రాష్ట్ర అధ్యక్షులు మురళి మనోహర్ అన్నారు. స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో టీఎల్ఎఫ్ క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సింగపాక కైలాష్ మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సిద్దేశ్వర్, యాదయ్య, నాగయ్య పెద్ది రాజు, సూర్య ప్రకాష్, నరసింహులు, వెంకటేష్ , శ్రీనివాస్ , మహేష్, విజయ్, నర్సింగరావు, నవీన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

నవతెలంగాణ-కొమురవెల్లి



కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ఈ నెల 15న భూమి పూజ చేసే స్థలాన్ని మంగళవారం రైల్వే ఎస్పీ అనూప్ కుమార్ శుక్ల పరిశీలించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, చేర్యాల సిఐ ఎల్ శ్రీను, ఎస్ఐ నాగరాజు, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పలువురు బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు

క్రీడాకారులకు కిట్స్ పంపిణి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్ర అహ్మదాబాద్‌లో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలకు వెళ్లే సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి నాగేందర్ , ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యాల రామేశ్వర్ రెడ్డి, టిజి పేట జిల్లా అధ్యక్షుడు ఏర్వా అశోక్‌లు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ క్రీడా దుస్తులు దాత గ్యాదరి పరమేశ్వర్, బ్యాగ్స్ దాత మెరిడియన్ విద్యా సంస్థ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు కనక రెడ్డి, వెంకట్ రెడ్డి, కరుణ రెడ్డి, నరేష్, శౌర్య, శిక్షకులు కృష్ణ కుమార్, నిశంక్ గౌడ్, సాయి , లీలా ఆనంద్, క్రీడాకారులు , తదితరులు పాల్గొన్నారు.

సెక్రటేరియట్ ట్రైనింగ్ కొరకు కేంద్ర ప్రభుత్వ సెక్షన్ ఆఫీసర్స్ జిల్లాలో పర్యటన ముగింపు

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వ సెక్టోరియల్ లెవల్-డి 15 మంది ఉద్యోగుల బృందం పర్యటన ముగించుకుని మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్‌తో సమావేశం అయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్‌కు సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ ట్రైనింగ్ కొరకు విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ సెక్షన్ ఆఫీసర్స్ ఈనెల 6 నుండి 13 వరకు బృందం జిల్లాలో పర్యటించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం పోషణ అభియాన్ మరియు తదితర పథకాల అమలు ప్రతి ఇంటికి తాగునీరు, గ్రామ పంచాయతీల విధులు, పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అభివృద్ధి పథకాల గుర్చి కలెక్టర్‌కి జిల్లా పర్యటన బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం అన్‌లైన్‌లో ఎంట్రీ

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని చేబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం కోసం వివరాలను అన్ లైన్ లో ఎంట్రీ చేస్తున్నరని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి సూచించారు. మంగళవారం చేబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం కోసం వివరాలను అన్ లైన్ లో ఎంట్రీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేబర్తి ప్రత్యేక అధికారి ,తహశీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, విద్యుత్ ఏఈ సుధీర్,సిబ్బంది గోవర్ధన్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయం వద్ద పులిహోర పంపిణీ

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



గజ్వేల్ అంగడి పేట్ హనుమాన్ దేవాలయంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ప్రతి వారం పులిహోర పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకుడు జే శేఖర్‌లతా దంపతుల ఆధ్వర్యంలో దాదాపు 150 మందికి పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, గోలి సంతోష్,సంపత్ మాట్లాడుతూ అన్నదానం మహా దానం అని, ప్రతి ఒక్కరూ దైవ భక్తి కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి, హనుమాన్ భక్త బృందం సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు విటమిన్ ఏ వేయించాలి



నవతెలంగాణ-అక్కన్నపేట

మండలంలోని గౌరవెల్లి అంగన్వాడీ సెంటర్‌లో ఏఎన్ఎం సారమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పిల్లలకు విటమిన్ ఏ ద్రావణాన్ని వేశారు. ఈ సందర్భంగా సారమ్మ మాట్లాడుతూ విటమిన్ ఏ ద్రావణం అనేది 9 నెలల పిల్లల నుంచి 5 సంవత్సరాలు వయస్సు గల పిల్లలందరికీ వేయించాలని అన్నారు. ఈ ద్రావణం వల్ల పిల్లల్లో రేచీకటి, ఎదుగుదల లోపం వంటివి రాకుండా నివారిస్తుంది అన్నారు. 49 మంది పిల్లలకు ఈ ద్రావణాన్ని అందించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నిర్మల, అంగన్వాడీ టీచర్ లక్ష్మి ఆశా స్వరూప పిల్లల తల్లులు, పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు ఆద్య స్కూలు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-సిద్దిపేట



ఈ నెల 16 నుండి 18 వరకు అహ్మదాబాద్, గుజరాత్ లో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఆద్యా స్కూల్ 7వ తరగతి విద్యార్థి లోహిత్ రెడ్డి ఎంపికైనట్లు ఆద్యా స్కూల్ చైర్మన్ మాధవి లత తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్ , సాగర్ , ఉపాధ్యాయ బృందం లోహిత్ రెడ్డికిలోహిత్ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్రములో విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించి, బాధిత కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ లింగాల సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ముస్తాబాద్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య భువనగిరిలో జరిగిన స్కూల్ పిల్లల ఆత్మహత్యలు, సూర్యపేట ఎస్సీ రెసిడెన్షియల్ లో జరిగిన ఇంటర్మీడియట్ అమ్మాయిల సూసైడ్, నారాయణ ఐఐటీ ప్రైవేట్ ఇంటర్ కాలేజీలో వినయ్ ఆత్మహత్య లపై విచారణ జరిపించాలన్నారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సుమారు 4 వేల మంది విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న నారాయణ, శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలను పూర్తిగా బ్యాన్ చేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రోల్ల రవిబాబు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిల్, ఆంజనేయులు, దీపక్ పాల్గొన్నారు.

దానంపల్లి గ్రామాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్

నవతెలంగాణ-చేర్యాల



ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని దానంపల్లి గ్రామాన్ని అడిషనల్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో గల డంపింగ్ ద్వారా తయారు చేస్తున్న ఎరువు తయారు చేసే విధానాన్ని పొడి చెత్త ద్వారా గ్రామ పంచాయతీకి వచ్చిన ఆదాయం గురించి ఆరా తీశారు. పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి పెరిగిన మొక్కలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌తో పాటు గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి నిర్వహణ బాగుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్నం భోజనం, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం గురించి ఆరా తీశారు. గ్రామపంచాయతీ పని తీరు బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, నియోజవర్గ ప్రత్యేక అధికారి (ఈడి ఎస్సీ కార్పొరేషన్) శ్రీరామ్ రెడ్డి, ఆఆడబ్ల్యూఎస్ ఈఈ సిహెచ్ గిరిధర్, మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ యాదవ్, డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్ రెడ్డి, ఇన్చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ, ఏపీవో మంజుల రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ బుర్ర సబిత శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి తరిగొప్పుల రాజు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నిరసనతో స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని వల్లంపట్ల గ్రామం నుండి కూటిగల్ వెళ్లే ప్రధాన రహదారి గత ఏడాది వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డును మరమ్మత్తులు చేయించాలని సీపీఐఎం మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వెంటనే వర్షాలకు కొట్టుకపోయిన రోడ్డుకు కల్వర్టుకు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా యాదగిరి ఆయన మాట్లాడుతూ సీపీఐఎం ఆధ్వర్యంలో జనవరి 24 న ప్రమాదకరంగా మారిన రోడ్డును సందర్శించి నిరసన తెలియజేశామన్నారు. వల్లంపట్ల తాజా మాజీ సర్పంచ్ ఆలేటి రజిత యాదగిరి, చొరవతో జిల్లా అధికారులు స్పందించి తెగిపోయిన రోడ్డుకు కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చేసినందుకు సీపీఐఎం పార్టీ మద్దూరు మండల కమిటీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ వార్డు సభ్యులు బొడ్డు సరస్వతి రవి, కాంట్రాక్టర్ యాదగిరి నాయకులు శ్రీను, మల్లేశం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ- కొండపాక



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ సిఐ రామకృష్ణ మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ లక్ష్మణ్, కవిత అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీటు బెల్టు తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వారు పేర్కొన్నారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరం , చట్ట ప్రకారం నేరమన్నారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీ గా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించ కుండా హెల్మెట్ పెట్టుకోకుండా, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి గులాబీ పువ్వులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క కాటుకు మందు లేని దుస్థితి

- అక్కన్నపేట ఎంపీటీసీల ఆగ్రహం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీ బిల్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అక్కన్నపేట ఎంపీటీసీ సాంబరాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇప్పించాలని అన్నారు. కొత్తగా ఏర్పడినటువంటి కొన్ని గ్రామపంచాయతీలకు సంబంధించి రేషన్ బియ్యం కోసం ప్రజలు చాలా దూరం ప్రయాణం చేయవలసి వస్తుందని, వారి గ్రామాల్లోనే, రేషన్ షాపులను ఏర్పాటు చేయించాలని కోరారు. అంతేకాకుండా గ్రామస్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని అధికారులకు విన్నవించారు. అనంతరం మల్లంపల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ పశు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, పశువుల డాక్టర్లు కనీసం పట్టించుకోవడంలేదని అన్నారు. సీజన్ అయిపోయాక టీకాలు వేస్తున్నారని, దీనివల్ల పశువులు అనారోగ్య బారిన పడి మరణిస్తున్నాయని తెలియజేశారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. అనంతరం గుడాటిపల్లి ఎంపీటీసీ రవి మాట్లాడుతూ గృహ జ్యోతి పథకాన్ని ప్రతి ఒక్క పేద కుటుంబానికి అందించాలని కోరారు. అలాగే గౌరవెల్లి సమీపంలో కొత్తగా ఏర్పడిన కాలనీలో పూర్తిగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని, వాటన్నిటిని త్వరగా క్లియర్ చేయాలని అన్నారు. రామవరం, అక్కన్నపేటలో ఏర్పడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేరుకు మాత్రమే ఉన్నాయన్నారు. కనీసం వైద్యాధికారులు ఉండడం లేదన్నారు. కుక్క కాటుకు కనీసం మందు కూడా దొరకని దుస్థితి నెలకొందన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సంజీవ్ కుమార్, ఇంచార్జ్ ఎంపీడీఓ శంకరయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగ ఎలక్ట్రానిక్ పరికరాల పునర్వినియోగం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను వాడుకలోకి తీసుకురావాలన్నదే తమ ధ్యేయమని కాలేజీ ప్రిన్సిపాల్ ఏ. శ్రీనివాస్ రెడ్డి అన్నారు మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీఎస్ కెసి విభాగం ఆధ్వర్యంలో నిరుపయోగ ఎలక్ట్రానిక్ పరికరాల పునర్వినియోగం, నిర్వహణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా టాస్క్ మేనేజ్మెంట్ ట్రైని బి. స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నిరుపయోగ ఎలక్ట్రానిక్ వస్తువుల సంఖ్య 16 నుండి 106 పెరిగిందన్నారు. వీటిని సమర్ధవంతమైన నిర్వహణ కోసం ప్రజలకు నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్మన్నారు. ప్రభుత్వం బడ్జెట్లో కొంత మొత్తాన్ని కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌కేసి కో-ఆర్డినేటర్ డాక్టర్ టి. కవిత, మెంటర్ ఎండి. జబ్బర్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.గణపతి రావు, సీనియర్ ఆధ్యాపకులు ఎస్. రమేష్ బాబు, లక్ష్మీనరసయ్య, మార్కండేయ, కైలాష్, పద్మ, కమలాకర్ పాల్గొన్నారు.

విలేకరిపై మట్టి మాఫియా దాడి

- వ్యతిరేక వార్తలు రాసే విలేకరుల అంతూ చూస్తామంటూ బెదిరింపులు

నవతెలంగాణ- కొండపాక



కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో అక్రమ మట్టి తరలింపుకు పాల్పడుతున్న మట్టి మాఫియా గ్యాంగ్ ఓ విలేకరిపై విచక్షణారహితంగా దాడి చేసిన అమానుష సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాధిత విలేకరి ముత్యాల యాదగిరి కొండపాక మండలం జప్తి నాచారం గ్రామానికి చెందినవారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్‌కు సంబంధించి వంతెన నిర్మాణ పనులలో భాగంగా తీస్తున్న మట్టిని అక్రమంగా కొంత మంది రియల్టర్లు వెంచర్లకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ మట్టి వ్యాపారానికి సంబంధించిన వాస్తవాలను తెలుసుకున్న యాదగిరి వార్తను ప్రచురించడంతో వారి దందాకు అడ్డొస్తున్నారనే కారణంతో మంగళవారం మధ్యాహ్నం తిమ్మారెడ్డి పల్లె శివారులో స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముస్త్యాల యాదగిరిని అడ్డుకొని విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. అతన్ని ఎవరూ లేని ప్రదేశంలోకి తీసుకువెళ్లి చంపుతామంటూ బెదిరించారు. దాడి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, సహచర జర్నలిస్టులకు తెలపడంతో అందరూ కలిసి యాదగిరికి అండగా నిలిచి కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జర్నలిస్టు యాదగిరి పై జరిగిన దాడిని టీయూడబ్ల్యూజే సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి తీవ్రంగా ఖండించారు.

కొమురవెల్లిలో 15న రైల్వే స్టేషన్‌కు భూమి పూజ



నవతెలంగాణ-కొమురవెల్లి: కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్‌లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి స్వాగత తోరణం వద్ద ఈ నెల 15న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా రైల్వే స్టేషన్ ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నట్లు సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానానికి తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారని వారి దశాబ్దాల కల నెరవేరిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పర్యటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విజ్ఞప్తి మేరకు ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర రైల్వే శాఖ మంత్రి ఆదేశాలతో కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బురుగు సురేష్ గౌడ్, నియోజకవర్గ కో- కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు దండ్యాల వెంకటరెడ్డి , బూరుగోజు నాగరాజు, కాశెట్టి పాండు, ఉమా రాణి, సానాది కర్ణాకర్, పోతుగంటి అంబదాస్, కొయ్యడ మల్లేశం పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఎస్ఎంహెచ్ పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట డిగ్రీ కళాశాల అనుబంధ స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ పూర్వ విద్యార్థులు హాస్టల్‌లో వంట పని చేసే నిరు పేద అయిన ముస్త్యాల భారతి కూతురు వివాహానికి 1,00,000/- ఆర్థిక సహాయం అందజేసి తమ దాతృత్వం చాటుకున్నారు. సిద్దిపేట పట్టణం ఎన్టీఆర్ నగర్ కు చెందిన భారతి స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్ లో వంట మనిషిగా 16 సంవత్సరాలనుండి పని చేస్తుంది. భర్త లేకపోవడం తో ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. కాగా ఆమె కూతురు వివాహం చేయడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అందరు కలిసి పెళ్లి సందర్భంగా లక్ష రూపాయల సహాయం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 16 సంవత్సరాల నుండి అమ్మలాగా వంట చేసి పెట్టిన భారతక్కతో మాది కుటుంబ సంబంధమని అక్కకు జీవితాంతం రుణపడి సహాయంగా వుంటామని తెలియజేశారు. ఈ పెళ్లి కార్యక్రమం లో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యం భరించలేక మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ తనకున్న మూర్ఛ వ్యాధిని భరించలేక ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండల పరిధిలోని మంతూర్ గ్రామంలో తాళ్ల బుజ్జమ్మ -రాములు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. గత కొద్ది కాలంగా తాళ్ల బుజ్జమ్మ (45) మూర్ఛ వ్యాధి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ప్రతిరోజు లాగే రాములు, తన కూతురు స్రవంతి సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంటి దగ్గర ఉన్న తాళ్ల బుజ్జమ్మ తనకున్న అనారోగ్య సమస్యలు తగ్గడంలేదని తీవ్ర మనస్థాపానికి గురై జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేరు సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్లిన కూతురు స్రవంతి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దూలానికి బుజ్జమ్మ వేలాడుతూ కనిపించింది. ఇటి విషయం పోలీసులకు సమాచారం అందించడంతో మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ తరలించారు.

64 కుటుంబాలే వంద రోజుల పని పూర్తి చేశాయి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ మండలలో ఉపాధి హామీ పని చేసిన కుటుంబాలు చాలా తక్కువగానే ఉన్నాయని డిపిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ గొండ స్వామి అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలంలో పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మండల పరిధిలో 25 గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులు నత్తనడక నడుస్తున్నాయన్నారు. ఒక వైపు మల్లన్న ముంపు గ్రామలైన వేములఘట్, ఎర్రవళ్ళి, ఏటిగడ్డ కిష్టాపూర్, బ్రహ్మణ బంజేరు పల్లి, సింగారం, పల్లే పహడ్ గ్రామాలలో అసలే పనిని చూపించకపోవడం పోవడంతో చేసేదేమీ లేదని ఇబ్బంది పడుతున్నట్లు ఆయన చెప్పారు. భవన నిర్మాణ రంగాలలో పారా పనులకు పోతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. గజ్వేల్ మండలలో చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గజ్వేల్ మండలంలో కేవలం 64 కుటుంబాలు మాత్రమే 100 రోజుల పని పూర్తి చేసుకోవడం పట్ల తీవ్ర అసంపూర్తి వ్యక్తమవుతుందన్నారు. 6 వేలకు పైగా కుంటుబాలు ఉంటే వెయ్యి జాబ్ కార్డులకు 10 మంది చొప్పున 100 రోజులు పని కల్పించడం పట్ల అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్నా పని దినాలు పెరగలేదన్నారు.

ఈ నెల16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె జయప్రదం చేయండి

- హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌లకు సమ్మె నోటీస్
- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్



నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్: కేంద్రం ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల16 న చేపడుతున్న సమ్మె ను జయప్రదం చేయాలనిమున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, చైర్మన్ ఆకుల రజిత లకు కార్మికులు సమ్మె నోటీస్ ఇచ్చారు. సందర్భంగా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్ప రి రవి కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా జాయింట్ కార్మిక సంఘాలు సమ్మె చేయనున్నాయన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సారయ్య, నాయకులు ప్రభాకర్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.